సాగునీటి ఉద్యమకారుడు అనారోగ్యంతో మృతి


వేణుగోపాల్ రెడ్డి(ఫైల్)

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన సాగునీటి ఉద్యమకారుడు కామిని వేణుగోపాల్‌రెడ్డి (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. వేణుగోపాల్ రెడ్డి కుందు పోరాట సమితి కన్వీనర్‌గా ఉంటూ సాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టాడు. ఆంధ్రప్రదేశ్లో రాయలసీమకు తాగు సాగునీటి కోసం పోరాట ప్రతిమ కొనసాగించాడు. శుక్రవారం గుండెనొప్పితో బాధపడుతూ కోల్గోలేక మృతి చెందాడు. ఈయన మృతికి పలువురు నాయకులు ప్రజాసంఘాల నాయకులు సంతాపం చేశారు.

మొక్కలు నాటండి...

విశాలాంధ్ర, జూపాడుబంగ్లా : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం అన్నారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో సర్పంచ్ మాధవరం ప్రకాశం ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంలో భాగంగా సచివాలయం వద్ద మొక్కలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలు విరివిగా నాటడం వల్ల గ్రామాల్లో వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ లింగయ్య, ఇంజనీర్ అసిస్టెంట్ సికామని, మహిళ కానిస్టేబుల్ మహేశ్వరి, పుల్లంరాజు, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 85 రద్దు చేయాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల : రాష్ట్ర ప్రభుత్వ ప్రాథమిక వైద్యుల సంఘం పిలుపుమేరకు జిఓ 85ను రద్దు చేయాలని చేపట్టిన సమ్మెను ఈనెల 14 నుండి కొనసాగిస్తున్నామని శిరివెళ్ల ప్రాథమిక వైద్యాధికారి దివ్య పేర్కొన్నారు. అత్యవసర కేసుల మినహా విధులు బహిష్కరించి శాంతియుత వాతావరణంలో నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వ సర్వీసులో ఉన్న వైద్యులు పీజీ చదివేందుకు వెసలుబాటు కల్పించాలని, ప్రాథమిక వైద్యులకు పదోన్నతులు కల్పించాలని, అలాగే గిరిజన ప్రాంతాలలో విధులు నిర్వహించే డాక్టర్లకు 30 శాతం అలవెన్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కు సంబంధించి ప్రత్యేక ఆలవేన్స్ ప్రకటించాలని, 2020 నోషనల్ ఇంక్రిమెంట్లు అమలు పరచాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈఓ వీర ప్రతాపరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని విద్యార్థులకు సూచించారు. అండర్-14, 17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర పోటీలను నిర్వహించారు. హెచ్ఎం నరసింహుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణ ఎస్సైగా జయప్ప బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా జయప్ప శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న వెంకటరెడ్డి కడప జిల్లా ప్రొద్దుటూరు త్రీ టౌన్‌కు బదిలీ అయ్యారు. జయప్ప మీడియాతో మాట్లాడుతూ ఆళ్లగడ్డలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి భరతం పడతామని హెచ్చరించారు.

క్రమ శిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విశాలాంధ్ర, కొలిమిగుండ్ల : విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని ఉన్నత విద్యావంతులు కావాలని ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య ఎంతో కీలకమన్నారు. సెల్‌ఫోన్లు, సినిమాలు తదితర వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. డ్రగ్స్ వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర, బనగానపల్లె : అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కైప గ్రామంలో చోటుచేసుకుంది. నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు కైప గ్రామానికి చెందిన మేదిన్నా హుస్సేన్ భాష 37 సంవత్సరాలు అప్పులు చేసి వాటిని తీర్చలేక కలాఫీ పౌడర్ గురువారం తాగగా చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందినట్లు అతని భార్య నురాన్ బి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-శిరివెళ్ల : మండల పరిధిలోని శిరివెళ్ల మెట్ట సమీపంలో గల 40వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాల లింగం(32) మృతి చెందినట్లు శిరివెళ్ల పోలీసులు తెలిపారు. గుంప్రమాం దిన్నె గ్రామంలోని ఎస్సీ కాలనీకిచెందిన ఊసల్ల మీకేలు, జ్ఞానమ్మ దంపతుల కుమారుడు బాల్‌లింగం నంద్యాల పట్టణంలో పని ముగించుకొని స్వగ్రామమైన గుంపుర మాను దిన్నెకు వస్తుండగా మార్గ మధ్యలో శిరివెళ్ల మెట్ట వద్ద రెండు మోటార్ సైకిల్ ఢీకొనడంతో బాల్ లింగం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై కఠిన చర్యలు తీసుకోండి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు

విశాలాంధ్ర, నంద్యాల అర్బన్: రోజురోజుకు కొత్త పుంతలతో ప్రజలను మభ్యపెట్టే ఆన్‌లైన్ మోసాలపై పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాకి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధిక వడ్డీలు, గంజాయి మత్తు పదార్థాలు, ఆన్లైన్ మోసాలు, భూకబ్జాలు, తాగుబోతుల వీరంగం, దొంగతనాలు, రౌడీయిజంకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, డోన్, బనగానపల్లె,పాణ్యం నియోజవర్గాలలో అధిక వడ్డీలతో పేద ప్రజల రక్తం తాగుతూ భూకబ్జాలు, రౌడీయిజం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. మరోవైపు ఆన్లైన్ మోసాలు, తాగుబోతుల వీరంగం మత్తు పదార్థాల వల్ల ప్రజలు యువత ఆకర్షితులై బానిసలుగా తయారవుతున్నారని, మరోవైపు అధిక వడ్డీలకు తెచ్చుకొని వాటిని కట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడి వారి జీవితాలను కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్నోసార్లు ఆన్లైన్ మోసాలను అరికట్టాలని ప్రయత్నించిన పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయని వాటిని అరికట్టడంలో పోలీస్ వ్యవస్థ సరైన నిర్ణయాలను తీసుకొని వాటి నుండి పేద ప్రజలను కాపాడాలని అన్నారు. నంద్యాలలో ఆన్లైన్ మోసాలతో యువకుడు ఆర్టిఓ ఏజెంట్ కరిముల్లా, ఉపాధ్యాయుడు ఖలీల్ ఆత్మ హత్యలు చేసుకోవడం, అధిక వడ్డీల వల్ల మున్సిపల్ కార్మికుడు, దొంగతనం నేరంతో అబ్దుల్ సలాం కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇటువంటి ఘటనలు జరుగుతున్న ప్రజలు వాస్తవాలు తెలుసుకోకుండా మోసపోతున్నారని తెలిపారు. నంద్యాల 1వ టౌన్ పరిధిలో రోజు రోజుకు తాగుబోతుల వీరంగం అధికమైందని, రైల్వే స్టేషన్ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్న మహిళలు తాగుబోతుల మూకలతో భయభ్రాంతులకు గురవుతున్నారని ఇలాంటి వారిపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న పాల్గొన్నారు.

అప్కాస్ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు

విశాలాంధ్ర - పాములపాడు : రాష్ట్ర వ్యాప్తంగా కేజీబివి టైఫ్ 4 అప్కాస్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం ఎస్ రమేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మోడల్ స్కూల్ అప్కాస్ కార్మికులతో కలిసి మాట్లాడారు మోడల్ స్కూల్ హాస్టల్,కేజీబివి హాస్టల్ లో వర్క్ చేస్తున్న మహిళా వార్డెన్స్, వర్కర్స్‌కి సెప్టెంబర్ మొదటి వారంలో రావాల్సిఉన్న వేతనాలు ఇంత వరకు విడుదల చేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్ని కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.గత 5 సంవత్సరాలుగా అప్కాస్ లో ఉన్న వారికి ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదాన్నరు. కేజీబివి టైఫ్ 4 పరిధిలో ఉన్న కార్మికుల సమస్యలు రాష్ట్ర స్థాయిలో పరిష్కరించే అధికారులు సరైన దృష్టి కేంద్రికరిం చడం లేదన్నారు. వీరికి పని గంటల విధానం రోజుకి 24గంటలు కుటుంబాలకు దూరంగా హాస్టల్ లో బస చేస్తూ మహిళాలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ఎన్నిసార్లు విన్నవించిన కనికరించడం లేదన్నారు. కరోనా సమయంలో అన్ని రంగాలలో వర్క్ చేసిన కార్మికులకు 8నెలల వేతనాలు విడుదల అయ్యాయని, వీరికి మాత్రమే ఇవ్వడంలో విఫలం చెందరన్నారు ఇప్పటికైనా వేతనాలు విడుదల చేయాలన్నారు. రాబోయే రోజుల్లో కేజీబివి టైఫ్ 4 కార్మికులు ఎదురుకుంటున్న సమస్యలపై రాష్ట్ర స్థాయిలో సమావేశం నిర్వహించి పరిష్కరానికి ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి మోడల్ స్కూల్ హాస్టల్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా నాయకులు శ్యామలమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్ళు లాంటివి ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- భూసార పరీక్షల మిషన్‌కు రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్ దారులకు ఒకేసారి రూ.7 వేలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే ఆంధ్రప్రదేశ్ రోడ్డు భవనాల పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు.శుక్రవారం కోవెలకుంట్ల మండలం గులదుర్తి గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సభలో రైతులు, ప్రజలు, పొదుపు మహిళలు వివిధ సమస్యల ను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మరోపక్క వరదలలో విజయవాడ అతలాకుతలం అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాత్రి పగలు కష్టపడేమే కాకుండా మంత్రులు, ఎమ్మెల్యేలతో పని చేయించి సంక్షోభంలో సంక్షేమం అందించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ప్రతి సమస్యకు పరిష్కారం చేస్తామని తెలిపారు. అంతేకాకుండా కోవెలకుంట్లలో అప్పటి ప్రభుత్వం భూసార పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసింది కానీ అందులో మిషన్లు లేకపోవడం వల్ల భూసార పరీక్షలు చేయలేకపోయారని ఈ సమస్య పరిష్కారానికి మంత్రి తన సొంత నిధులతో రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

అలాగే బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు మరుగుదొడ్ల లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకొని రావడంతో మంత్రి తన సొంత నిధులను రూ.20 లక్షల చెక్కును అందజేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

అలాగే గ్రామంలో ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి, ఉమాకాంత్ రెడ్డి, పిఆర్‌డిఈ నాగ శ్రీనివాసులు, ఎంపీడీవోసయ్యద్ ఉన్నిసా,తాసిల్దార్ పవన్ కుమార్‌రెడ్డి, సీఐ హనుమంతు నాయక్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం వందరోజుల పరిపాలన భేష్..

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : టిడిపి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన భేష్ అని వక్తలు కొనియాడారు. ప్రభుత్వం సాధించిన విజయాలపై అధికారులు 1వ, నాలుగవ సచివాలయాలలో వార్డు సభలు నిర్వ హించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్ హుస్సేన్ భాష మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు అయి కేవలం వంద రోజుల వ్యవధిలోనే ఎన్నో విజయాలను సాధించిందని వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు కౌన్సిలర్ గురుమూర్తి, ఏఈ సురేంద్ర, మెప్మా అధికారిని శోభ, వార్డ్ టీడీపీ ఇంచార్జ్ రమీజాబీ సచివాలయ సిబ్బంది బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-వెలుగోడు : అందరి మంచి కోరుతూ రాష్ట్ర ప్రగతికి పాటుపడుతూ ప్రజలతో ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుంటున్న కూటమి సర్కారు అని ఆ పార్టీ నాయకులు అన్నారు. దిగ్విజయంగా వందరోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం "ఇది మంచి ప్రభుత్వం పోస్టర్ విడుదల చేశారు. నిరుద్యోగులకు డియస్సి నోటిఫికేషన్, పేదలకు 4 వేల పెన్షన్, 5 రూపాయలకు పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటిన్, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు లాంటి పథకాల గురించి వెలుగోడు మండలం వెల్పనూర్ గ్రామంలో ఈ రోజు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణ, ఎంపిడిఓ అమానుల్ల మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు పోతం క్రిష్ణరెడ్డి, అన్నారాపు శంకర్ రెడ్డి, అంకిరెడ్డి, శంకర్ రెడ్డి, పరమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలను అందించే పార్టీ టీడీపీ : మంత్రి ఫరూక్

విశాలాంధ్ర - నంద్యాల : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. టీడీపీది పేదల సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు. శుక్రవారం నంద్యాల నూనెపల్లె వాటర్ ట్యాంక్ దగ్గర ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వమనే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్లు రూ.3000 నుంచి ఒకే సారి రూ.4000 లకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచి అత్యంత సాహెూపేతమైన నిర్ణయం తీసుకున్నారనీ పేర్కొన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత కల్పించారని, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు చెల్లింపు కార్యక్రమం చేపట్టారని, విజయవాడలో వరద బాధితులను కంటికి రెప్పలా 10 రోజుల పాటు బస్సులో ఉండి ఓ తండ్రిలా ప్రజల్ని ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. నంద్యాల నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేస్తామని చెప్పారు. గ్రామానికి శ్మశానం, త్రాగునీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, స్పెషల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాబి, నాగార్జున, మాజీ కౌన్సిలర్లు వాకా శివ శంకర్ యాదవ్, కృపాకర్, షేక్ మున్నా, సాయిరాంలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సంక్షేమం వైపు అడుగులు ..

విశాలాంధ్ర, మిడుతూరు- ఆర్థికంగా కష్టాల్లో కూరుకుపోయిన రాష్ట్రానికి కూటమి ప్రభుత్వం కొత్త ఊపిరి పోస్తూ సంక్షోభంలోనూ.. సంక్షేమాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన పరిపాలన అందించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అడుగులు ముందుకు వేస్తున్నారని టిడిపి నాయకులు సంపంగి రవీంద్ర తెలిపారు. శుక్రవారం నాగలూటి గ్రామంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా మరింత ప్రజలకు సేవలు అందించేందుకు ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం 100 రోజులలో చేపట్టిన కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి. నాగ శేషాచలరెడ్డి, ఈఓఆర్‌డి ఫక్రుద్దీన్, ఏపీడి బాలాజీ నాయక్, ఏపీవో జయంతి, పంచాయతీ కార్యదర్శి గ్రామ టిడిపి నాయకులు కురువ గోకారి తమిదేల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం..
నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

విశాలాంధ్ర, జూపాడుబంగ్లా: రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లెం గ్రామంలో తెలుగుదేశం ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షోభంలోనూ సంక్షేమం అందించి, అభివృద్ధికి రెక్కలు తొడిగారాన్నరు. నిరుద్యోగులకు అండగా నిలబడుతూ మెగా డీఎస్సీతో 16,437 ఉపాధ్యాయ పోస్టుల ఒకేసారి భర్తీ చేపట్టారని, అవ్వతాతలకు పింఛన్లు ఒకేసారి 1000 పెంచి రూ.4 వేలు ఇవ్వడం ఒకటైతే మొదటి నెల ఒక్కొక్కరికీ రూ.7000లు చొప్పున ఒకేరోజు ప్రభుత్వ ఉద్యోగుల చేత 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్ల రూ.4,408 కోట్లు పంపిణీ చేయడం దేశంలోనే ఒక తిరుగులేని సంక్షేమ చరిత్ర అని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో 3 వేలు ఇవ్వడానికి ఐదేళ్ల సమయం పట్టిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు ఇస్తున్నారు. పేద ప్రజల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 5 రూపాయలతోనే ఆకలి తీర్చే 175 అన్న క్యాంటీన్లను పునః ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రజలకు నిద్ర లేకుండా చేసిన "ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్"ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని అన్నారు. విజయవాడలో వరదలలో ప్రజలు అనేక ఇబ్బందులతో విలవిల లాడుతున్నప్పుడు, 10 రోజుల పాటు బస్సులో ఉండి, నిద్రాహారాలు మాని, ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్న ముఖ్యమంత్రి మన చంద్రబాబు నాయుడని అన్నారు. ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ కోఆర్డినేటర్ గిరీశ్వర్ రెడ్డి, బిజెపి ఇన్చార్జి చల్ల దామోదర్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ కృపమ్మ, బాల మద్దిలేటి, సత్యనారాయణరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, దొరబాబు రెడ్డి,రవికుమార్ యాదవ్, జంగాల పెద్దన్న, కృష్ణారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్, ఇంచార్జ్ ఎంపీడీవో నూర్జహాన్ పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-అవుకు : కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండలంలో ప్రారంభమైంది. ఈవోఆర్డీ రామకృష్ణ వేణి ఆధ్వర్యంలో అన్నవరంలో, విద్యాధికారి శ్రీధర్ రావు ఆధ్వర్యంలో వేములపాడులో, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చనుగొండ్లలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నవరంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ విద్యపై చంద్రబాబు డేగ కన్ను

- మెడికల్ కళాశాలు ప్రైవేట్‌పరం చేయాలని కుట్ర
- జీవో 107, 108ని తక్షణమే రద్దుచేయాలి
- ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్

విశాలాంధ్ర-నంద్యాల : మెడికల్ విద్యను నాశనం చేసి, పేద విద్యార్థులకు మెడికల్ విద్యను అందని ద్రాక్ష చేస్తున్న చంద్రబాబు అని ఎఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్ ఆరోపించారు. యువగలం పాదయాత్రలో మేము అధికారంలోకి వస్తే 107,108 జీవోలను రద్దు చేస్తామన్న నారా లోకేష్ ఎక్కడ అంటూ నిలదీశారు. ఈ సందర్భంగా స్థానిక నంద్యాల జిల్లా సిపిఐ కార్యాలయం ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మెడికల్ కళాశాలలను గుజరాత్ మోడల్ పద్ధతిలో ఆ రాష్ట్రంలో 37 మెడికల్ కళాశాలలుంటే 6 మాత్రమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలుగా ఉన్నాయని, మిగతావన్ని ప్రైవేట్ వారి చేతిలో ఉన్నాయని, అదే పద్ధతిలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలలను ప్రైవేట్, కార్పొరేటర్ సంస్థలకు ధారదాత్తం చేసే యోచన టిడిపి ప్రభుత్వం ఎన్డిఎ కూటమి ప్రయత్నం వేగవంతం చేస్తుందని, ఇది చాలా కుట్ర, కార్పొరేట్ శక్తులకు పంట పండినట్టే, చంద్రబాబు పరిపాలనలొ ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు పెద్దపిట వేస్తూ వస్తున్నారని, చంద్రబాబు 2015లొ తను అధికారంలొ ఉన్న సమయంలొ చిత్తూరు జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కళాశాల అపోలో కంపెనీ వారికీ జీవో.125 తీసుకొచ్చి 3 ఏళ్ళ లిజ్ కి ఇచ్చేసాడని, తరువాత 2016లో జీవో 40 తీస్కొని వచ్చి ఏకంగా 30 ఏళ్ళు లీజుకి ఇచ్చాడన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే జీవో 107, 108 రద్దు చేసి, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలు మౌలిక సదుపాయాలు కల్పించి, పోస్టులు భర్తీ చేసి, పూర్తి భవనాలను నిర్మించి, ఎంబిబిఎస్ సీట్లను భర్తీ చేయాలని ఎఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన సిఐని కలిసిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర, ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరుకు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వచ్చిన సురేష్ కుమార్ రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా సిపిఐ తాలూకా కమిటీ ఏఐటీయూసీ కమిటీ ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ పట్టణ కార్య దర్శి యస్. అహమ్మద్ హుస్సేన్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పూలబోగే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లల్లు, షబ్బీర్, షైక్షావలి, మాబాషా, రసూల్, పాములపాడు మండల కార్యదర్శి చిలక యేసేపు, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి...

విశాలాంధ్ర, బనగానపల్లె: విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రవ్వలకొండలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ రామలక్ష్మి ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి కొన్ని ప్రైవేట్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబ్ కమ్యూనిటీ ఔట్ రిచ్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఇంద్రారెడ్డి పాల్గొని విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి ప్రాజెక్టుల గురించి వాటి ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. అనంతరం విజేతలకు మెడల్స్ ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే ఈ ప్రదర్శన ప్రాజెక్ట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా రెడ్డి వారి సొంత నిధులతో ప్రోత్సాహ బహుమతులను అందజేశారు.పాఠశాల యాజమాన్యంలోని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు బీసీ ఇందిరారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిలో పరుగులు

విశాలాంధ్ర-చాగలమర్రి .. పేదలకు సంక్షేమాభివృద్ధిలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రగతి పరుగులు తీస్తున్నదని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌భాష తెలిపారు. చాగలమర్రి 3వ సచివాలయ పరధిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం అధికారులు, కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా,ఈఓఆర్‌డి తాహీర్‌హుసేన్,టిడిపి నాయకులు టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ నల్లా నాగరాజు పాల్గొన్నారు.

పేదల కాలనీలకు కరెంటు మీటర్లు ఇవ్వాలి-సీపీఐ

విశాలాంధ్ర-కర్నూలు : పేదల కాలనీలకు కరెంటు మీటర్లు ఇవ్వాలని సీపీఐ నాయకులు ఎస్ఈకి వినతిపత్రం అందచేశారు. సీపీఐ కర్నూలు నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నగరంలోని 20 వార్డులోని చదువుల రామయ్య కాలనీ నందు పేదలు రెండేళ్లుగా నివాసం ఉంటున్నారన్నారు. కాలనీల్లో తక్షణమే వీధి లైట్ల ఏర్పాటు,కరెంటు మీటర్ల సౌకర్యం కల్పించాలని కోరారు.ఎస్ఈ స్పందిస్తూ విచారణ చేయించి అర్హులైన పేదలందరికీ కరెంటు మీటర్లు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్ఈని కలిసిన వారిలో సీపీఐజిల్లా కార్యవర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు అన్వర్, నల్లన్న వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

నేడే అన్న క్యాంటీన్ల ప్రారంభం

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: పేద ప్రజలకు రూ.5లకే భోజనం అందించే అన్న క్యాంటీన్లను శనివారం ప్రారంభిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 5 అన్న క్యాంటీన్లు ఉన్నాయని, శనివారం రెండు అన్న క్యాంటీన్లను మేయర్ బి.ఎల్లా రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభిస్తారని తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పరిమళ నగర్, మధ్యాహ్నం12:30 గంటలకు సెట్కూర్ కార్యాలయం వద్దనున్న క్యాంటీన్లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కాగా సెట్కూర్ వద్దనున్న క్యాంటీన్‌ను రూ.9.99 లక్షలతో, పరిమళ నగర్‌లోని క్యాంటీన్‌ను రూ.10.20 లక్షలతో ఆధునీకరణ పనులు పూర్తి చేశారు. కలెక్టరేట్, పాత బస్టాండ్‌లోని అన్న క్యాంటీన్లను సోమవారం మంత్రి టి.జి.భరత్ ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఆలూరు బ్రాంచి కెనాల్ ద్వారా సాగు నీరు అందించాలి-బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఆలూరు బ్రాంచి కెనాల్ నుండి పంట పొలాలకు సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య కోరారు. శుక్రవారం నగరంలోని సీఆర్. భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం లో చిప్పగిరి,హలహర్వి,ఆలూరు మండలాల్లో 14,265 ఎకరాలకు సాగునీరు అందించనున్న ఏబీసీ కాలువకు అనేక సంవత్సరాల నుండి తుంగభద్ర ఎగువ కాలువ ద్వారా పూర్తిస్థాయిలో నీరు రాక రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీసీ కాలువ కింద ఆయకట్టు రైతులు ప్రధాన పంటలు మిర్చి,ఉల్లి, పత్తి పంటలు సాగు చేస్తారని పంట వేయడం కోసం విత్తనాలు, ఎరువులు, సాగు ఖర్చులకోసం లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారని పూర్తిస్థాయిలో నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారని హెచ్ ఎల్ సి కాలువ ద్వారా ఏబీసీ కాలువకు 14,265 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా ప్రతి సంవత్సరం సగం భూములకు కూడా నీళ్లు రావడంలేదని దీని కారణంగా పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఏబీసీ కాలువకు చిప్పగిరి సమీపంలో హంద్రీనీవా ప్రధాన కాలువ పూర్తి స్థాయిలో నిండుగా పారుతుందని అక్కడ తూము ఏర్పాటు చేసి ఏబీసీ కాలువకు నీళ్లు వదిలితే రైతుల పంట పొలాలకు సాగునీరు సమృద్ధిగా అందించవచ్చని రైతులు అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ తూము మాత్రం ఏర్పాటు చేయడం లేదని రైతుల పంట పొలాలను కాపాడడానికి తక్షణమే నీటిపారుదలశాఖ జిల్లా ఉన్నతాధికారులు,జిల్లా కలెక్టర్ స్పందించి తూము ఏర్పాటు చేసి రైతుల పంటలను కాపాడాలని బి.గిడ్డయ్య కోరారు.

ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప,సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే.జగన్నాథం పి. రామకృష్ణారెడ్డి పార్టీ నాయకులు వి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ లీడర్స్‌కు భద్రత కల్పించాలి-ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విద్యుత్ మీటరు లీడర్స్ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎస్. మునెప్ప అన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మునెప్ప, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి చంద్రశేఖర్‌లు హాజరై ప్రసంగిస్తూ విద్యుత్ మీటర్ లీడర్స్‌కు.పని ఒత్తిడి పెరిగిందని యూనియన్ పోరాడి నా ఫలితంగా 7+2 నుండి 9+2కు. బిల్లులు కొట్టాలని వర్కర్లు ఉన్నప్పటికీ అధికారులు కాంట్రాక్టర్లు వేధింపులతో ఐదు రోజులకే బిల్లులు కొట్టాలని మీటర్ రీడర్స్‌లపై ఒత్తిడి చేస్తున్నందున మీటర్ రీడర్స్ ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 9+2 రోజుల పాటు బిల్లులు కొట్టేందుకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్తు యజమాన్యం ఎండి విద్యుత్తు మీటర్ రీడర్లకు ఎస్క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని సర్కులర్ ఇచ్చినప్పటికీ దాని అమలు చేయడానికి ఏజెన్సీ కాంట్రాక్టర్లు విముఖత చూపుతున్నారన్నారు. తద్వారా కార్మికులకు రావలసిన జీతాలిచ్చే దానిలో కోతలు పెట్టరాదని దూకుడు చేయలేరని అందుకే తక్షణమే విద్యుత్తు మీటర్ రీడర్స్ ఎస్క్రో అకౌంట్ ద్వారా సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించాలన్నారు. మీటర్ రీడర్లకు పిస్ రేట్లను ఎత్తివేసి కనీస వేతనాలు అమలు,ఉద్యోగ భద్రత కల్పించాలని భవిష్యత్తులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే కార్మిక ఆందోళనకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎస్.మునెప్ప, జిల్లా అధ్యక్షులు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా కోటేశ్వరరావు, లతీఫ్, మహేష్, కార్యదర్శిగా ఎస్.హమీద్, జనరల్ సెక్రెటరీగా నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శులు రామకృష్ణ,టి.వెంకటేష్ బి. వీరశేఖర్ ట్రెజరర్‌గా రాముడు ఎన్నుకున్నారు.

మొక్కల సంరక్షణతోనే మనుగడ-నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని నగర పాలకకమిషనర్ ఎస్. రవీంద్రబాబు తెలిపారు. స్వచ్ఛ హి సేవ కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతిఒక్కరి బాధ్యతన్నారు. అవకాశం ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి ఎం.విశ్వేశ్వరరెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈ నరేష్, టీపీఆర్వో వెంకటలక్ష్మి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వలి తదితరులు పాల్గొన్నారు.

సీబీజీ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించిన కమిషనర్

గార్గేయపురం డంప్ యార్డులో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ (సిబిజీ) స్థలాన్ని శుక్రవారం కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏటా టన్నుల కొద్దీ వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండటంతో భూమి కలుషితమై పోతుందని, దానికి పరిష్కారంగా చెత్త నుండి బయోగ్యాస్ తయారు చేసే సీబీజీ ప్లాంట్ ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి వి.విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ షాకీర్, ఏఈ దినేష్, టౌన్ సూపర్వైజర్ షబ్రీష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

విశాలాంధ్ర-పత్తికొండ: యువత గంజాయి మత్తు లో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని డీఎస్పీ వెంకట్రామయ్య పేర్కొన్నారు. శక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో అక్రమంగా గంజాయి సరఫరా జరుగుతోందని, గంజాయి సరఫరా చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. యువకుల తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికలను గమనించాలన్నారు. చెడు వ్యసనాలు అలవాటు పడే యువతను చైతన్యవంతం చేసి గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామన్నారు. ఈసమావేశంలో అర్బన్ సీఐ జయన్న, రూరల్ సీఐ పులి శేఖర్‌గౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన డీసీసీ అధ్యక్షులు

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : జిల్లా కాంగ్రెస్ కమిటి నూతన అధ్యక్షులుగా నియమితులైన పరిగెల మురళీకృష్ణ జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివ సేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మురళీకృష్ణ కోరారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : మండల పరిధిలోని బి.తాండ్రపాడులో రూ.25 లక్షల వ్యయంతో మెయిన్ రోడ్డు నుండి మంగళగిరి కాలని వరకు వేయుచున్న సిమెంట్ రోడ్డు కు శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాష,కర్నూలు ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరిలు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు నుండి మంగళగిరి కాలని వరకు దాదాపుగా 5 మీటర్ల వెడల్పుతో 400 మీటర్ల సీసీ రోడ్డును రూ.25 లక్షల వ్యయంతో నిర్మించడం జరుగుతోందని, రోడ్డు పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారులను, అధికారులను ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలను గ్రామస్థులు ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ అమర్నాథరెడ్డి, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్డీవో శేషిరెడ్డి, పంచాయతీ రాజ్, రవిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన మందులు అందించాలి

విశాలాంధ్ర-హెరాళగుంద : హెరాళగుందలో శుక్రవారం లైవ్‌కేర్ ఆస్పత్రి-మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌ను శుక్రవారం మౌలి విహబీబుల్లా ప్రార్థనలు, దువా చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన మందులను అంగడి యజమానులు అందించి అందరి ఆరోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు దూరలవాట్లకు దూరంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా యువకులు డ్రగ్స్ అలవాటుకు ఎంతో దూరంగా ఉంటే వారి జీవితాలు బాగుంటాయన్నారు. యువకులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం కోసం పాకులాడకుండా స్వయం వృద్ధితో అంగళ్లు నడుపుకొని సమాజానికి ప్రజలకు సేవ చేయాలని కోరారు. అంగడి యజమానులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి మందులు సరఫరా చేస్తే చాలన్నారు. ముస్లిం మత పెద్దలు కరీంసాబ్, లుక్మాన్ సాబ్, ముల్లావలి, మిస్బా, అంగడి యజమాని ఎం హసుదుల్లాలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం తోనే ప్రజల జీవనానికి మనగడ

విశాలాంధ్ర-సి.బెళగల్ : మొక్కలు పెంచి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే భవిష్యత్తులో మనిషి జీవనానికి మనగడ ఉంటుందని ఈవో ఆర్డీ సందీప్ అన్నారు. స్వచ్ఛ సే వహీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన సి.బెళగల్ లోని ఆదర్శ పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు పెంచడంతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం లోనూ అందరు సహకరిస్తేనే భవిష్యత్తులో ప్రజల జీవన మనుగడ బాగుంటుందని లేకపోతే చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వంశీ మోహన్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అలాగే ఆ పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ లు బీరకాయల తిప్పన్న, గోవిందు, టీడీపీ నాయకుడు బాలాజీ వెంకటేష్, సర్పంచు పాండు రంగన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీల పట్టివేత అపరాధ రుసుము వసూలు

విశాలాంధ్ర-జిల్లా పరిషత్తు : లారీల పట్టివేత అపరాధ రుసుము వసూలు

డోన్ నుంచి డెవలప్ పౌడర్ మొదలెట్టి చిప్స్ అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను శుక్రవారం విజిలెన్స్ టీము పట్టుకొని సీజ్ చేసి డోన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. రెండు లారీలకు సంబంధించిన వారితో ఒక్కొక్క లారీకి రూ.50 వేల ప్రకారం లక్ష వసూలు చేసి విడిచి పెట్టడం జరిగిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ విలేకరులకు తెలిపారు.రాయల్టీ ఇన్స్పెక్టర్ బాల నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ కోసం ఓ మొక్క పెంచుకుందాం..!

విశాలాంధ్ర-కౌతాళం: మండల పరిధిలోని చూడి గ్రామంలో అమ్మ కోసం మొక్క అనే కార్యక్రమాన్ని అభివృద్ధి అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్వచ్ఛహీ -సేవ , స్వభావ్ స్వచ్ఛత -సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో స్వచ్ఛత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలోనూ ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు కార్యక్రమంలో ఏపీఓ జుబేర్ అహ్మద్ ,టెక్నికల్ అసిస్టెంట్ చిన్న నాగన్న, ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు

సెమినార్ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-హెరాళగుంద : జిల్లాలో పూర్తిగా వెనుక బడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధిలో మీడియా, ప్రజా ప్రతినిధులు, అధికారుల పాత్రపై సెమినార్ ఈనెల 22న ఆలూరు వాసవి కళ్యాణ మండపంలో జరుగుతుందని మండల ఏపీయూ డబ్ల్యూజే అధ్యక్షులు సిహెచ్ నాగరాజా శుక్ర వారం తెలిపారు.నియోజకవర్గం ఏపీయూడబ్ల్యూజే కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించడం జరుగుతుందన్నారు సెమినార్లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీభరత్, ఎంపీ పంచలింగాల నాగరాజు, కలెక్టర్ రంజిత్‌భాష, రాష్ట్ర సీపీఐ పార్టీ కార్యదర్శి కె రామకృష్ణ, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరాం, విరుపాక్షి,బూర్ల రామాంజనేయులు, ఎమ్మెల్సీలు బిటి నాయుడు, మధుసూదన్ నాయుడు, నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ వీరభద్ర గౌడ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛందసేవ సంఘం నాయకులు జాతీయ ఐజేయు కార్యవర్గ సభ్యులు గోరంట్ల కొండప్ప, నాగరాజ్, జిల్లా ఏపీయూ డబ్ల్యూజే సంఘమ అధ్యక్షులు ఈ నాగరాజు గౌడ్ ప్రధాన కార్యదర్శి ఈ శ్రీనివాస గౌడ్ జిల్లా ఏపీయూడబ్ల్యూజే సంఘం ఉపాధ్యక్షులు స్వరూప్ కుమార్, చంద్రమోహన్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుంకన్న, ఆలూరు ఏపీయూడబ్ల్యూజే సంఘం అధ్యక్షుడు సురేష్, తాలూకా కార్యదర్శి చంద్రబాబు ఆలూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రాజేష్ నాయుడు తాలూకా కమిటీ, నియోజవర్గంలోని మండల కమిటీ నాయకులు హాజరవుతారన్నారు. సెమినారుకు నియోజకవర్గం లోని అందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి తాలూకు అభివృద్ధి కోసం చర్చించి సలహా సూచనలు ఇచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హెరాళగుందలో ఎంపీపీ నూర్జహాన్‌బి, సర్పంచు చలువాది రంగమ్మ, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చిన్నహేట శేషగిరి, సీనియర్ టీడీపీ నాయకుడు రాజా పంపన గౌడ్, ఎస్సై బాల నరసింహులు, ఎండిఓ సుహాసిని అమ్మ, తహసీల్దార్ ప్రసాద్ తదితరులను ఆహ్వానిస్తూ కరపత్రాలు విడుదల చేశామన్నారు

మండల ఏపీయూడబ్ల్యూజే సంఘం నాయకులు అందరూ తప్పకుండా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సంఘం అధ్యక్షులు సిహెచ్ నాగరాజా, ప్రధాన కార్యదర్శి ఎం.రవికాంత, గౌరవాధ్యక్షులు అమీర్‌సాబ్, ఉపాధ్యక్షులు నాగప్ప, విరుపాక్షి, సహకార దర్శి మహబూబ్‌బాష, కోశాధికారి మహేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఈ నాగరాజుగౌడ్, కార్యవర్గ సభ్యులు సంజయ్, ముధస్సర్, మంజునాథ్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-జిల్లాపరిషత్తు: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్.జయలక్ష్మికి డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్బారెడ్డి పూలబొకేతో శుభాకాంక్షలు తెలిపారు. హమాలి యూనియన్, మహిళ హమాలీలు, పలువురు కమిషన్‌దారులు, పూల బొకేలు, మిఠాయిలు అందించి అభినందించారు. అనంతరం మార్కెట్‌లో పెండింగ్‌లో ఉండే హమాలీలు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. మహిళలకు లైసెన్సులు ఇవ్వాలని మహిళ హమాలీలు కోరారు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి జయలక్ష్మి హామీ ఇచ్చారు.మార్కెట్ లో ఉండే పెండింగ్ సమస్యలు అన్ని పరిస్కారం చేసేలా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్యదర్శి రెహమాన్ , వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

పేదవారి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్లు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు : పేదవాడి ఆకలి తీర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని.. ఈఅన్న క్యాంటీన్‌లు పేదవారికి ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యేడా. బీవీ జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సోమప్ప సర్కిల్, శ్రీనివాస థియేటర్ ఎదురుగా రెండు అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అల్పాహారంతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ లను మూసివేసి పేదల కడుపు కొట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పునః ప్రారంభం చేశారని పేర్కొన్నారు. పేదలు వివిధ పనులు మీద పట్టణానికి వస్తుంటారని వీరికి రూ.5లకే అల్పాహారం, భోజనం అందించాలన్నదే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ప్రజలందరూ కుడా అన్న క్యాంటిన్ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి,డీఈ మనోహర్‌రెడ్డి, నీరజ, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు రామదాసుగౌడ్, కొండయ్యచౌదరి, రంగస్వామిగౌడ్, రామకృష్ణనాయుడు,నవాజ్ తురేగల్ నజీర్ అహ్మద్, జనసేన నాయకులు నవీన్ కుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీకి-పంట నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-సి.బెళగల్ : ఈకేవైసీకి మరియు పంట నమోదుకు ఈనెల 23చివరి తేదని..ఆలోగా ప్రతి ఒక్కరూ నమోదుచేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మల్లేష్ కుమార్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లలదొడ్డిలో రైతులు సాగు చేసిన సజ్జ, కంది పంటలను వ్యవసాయాధికారి పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ పంట నమోదు మరియు ఈకేవైసీకి గడువు ఈనెల 23వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు. రైతులు ఇప్పటివరకు ఈ పంట నమోదు చేయించుకోని రైతులు తప్పనిసరిగా మీ గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రం ఇన్చార్జీల దగ్గరకు వెళ్లి వేలి ముద్రలు వేయించుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు. అనంతరం వ్యవసాయ కేంద్రం నందు రైతులకు ఈకేవైసీని చేయించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శశికాంత్ మరియు ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, సునంద మరియు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కౌతాళం : మండలంలోని అన్ని గ్రామాలలో పంటల నమోదు కార్యక్రమం పూర్తయినట్లు వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. మండలంలోని రైతులందరూ తమ పంటలను మంగళవారం లోపు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈ కేవైసీ, ఈక్రాప్ బుకింగ్‌ని తప్పక నమోదు చేయించు కోవాలన్నారు. ప్రభుత్వం 23వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. రైతులు ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేయించుకోవాలని తెలిపారు.

తిరుమల విశిష్టతను మంట కలిపిన తుగ్లక్ జగన్‌రెడ్డి

విశాలాంధ్ర-ఆదోని రూరల్: ఎంతో పవిత్రమైన హిందూ దేవాలయముగా ప్రపంచమంతా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టతను వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంటగలిపారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్, రాష్ట్ర కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ విరుచుకు పడ్డారు. శుక్రవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందువుల మనోభావాలు జగన్మోహన్ రెడ్డి దారుణంగా దెబ్బతీశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయం అవినీతి ఎక్కువగా అవ్వడంతో రివర్స్ టెండరింగ్ పేరుతో దశాబ్దాలుగా వాడిన "నందిని నెయ్యి"ని పక్కన పెట్టి తక్కువగా వస్తుందని భావించి ఢిల్లీకి చెందిన"ఆల్ఫా మిల్క్" మరియు "మాల్ మంగ మిల్క్" ప్రొడక్ట్‌ను తక్కువ టెండర్‌కి తీసుకొన్నారని గుర్తు చేశారు.దీంతో నెయ్యి నాణ్యత-లడ్డూలో నాణ్యత లోపించిందన్నారు.

ఢిల్లీకి చెందిన ఆల్ఫా మిల్క్ మరియు మాల్గంగా మిల్క్ ప్రొడక్ట్ కేవలం రూ.,450లకే కేజీ నెయ్యి వస్తుందని అక్రమ సంపాదనకు పాల్పడం జరిగిందన్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి సరఫరా చేస్తున్న నందిని నెయ్యి రూ.800లకు ఇవ్వడం జరుగుతుందన్నారు.2019-24 వరకు వైయస్సార్సీపీ గవర్నమెంట్ లో టీటీడీలో అనేక అవినీతి రాజకీయం జరిగిందన్నారు. లడ్డు నాణ్యత లోపంతో పాటు డిక్లరే తీసివేశారని తెలియజేశారు. నిత్య అన్నదాన సత్రంలో ఎంతో అవినీతి జరిగిందని మరియు నాణ్యత అనేది లేదు శ్రీవాణి ట్రస్ట్ పేరిట దర్శనం అనేది అవినీతితో కూడుకున్నదన్నారు.ఇవన్నీ కూడా జగన్మోహన్ రెడ్డి సీఎం గా వచ్చిన తర్వాత నుంచి జరిగిన అవినీతి అనేది తాండవిస్తుందని విజ్ఞప్తి చేశారు.

పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-కోసిగి: పౌష్టికాహారం తోనే గర్భిణీలు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సర్పంచు కుమారి అయ్యమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా సమావేశం నిర్వహించామన్నారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు అంగన్వాడి కేంద్రాల్లో నుండి ప్రభుత్వం నుంచి వస్తున్న పౌష్టికాహారన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రత్యేకించి ఆకు కూరలు,పండ్లు,కూరగాయలు వంటివి తినాలన్నారు. ప్రతి నెల రక్తపరీక్షలు చేసుకోవాలన్నారు.ఐసీడీఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి, లక్ష్మీదేవి, క్యాతాయిని, ఎంపీహెచ్‌వో శ్రీనివాసులు, ఆదోని ఫౌండేషన్ ప్రతినిధి విజయకుమార్, అంగన్వాడి కార్యకర్తలు హెబ్సిబా రాణి, లుసమ్మ, వరలక్ష్మి, శైలజ, సుజాత, ఆశావర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

టీడీపీ తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం-ఎమ్మెల్యే గౌరు

విశాలాంధ్ర-కల్లూరు: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు.శుక్రవారం కొంగనపాడులో కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో పాటుపడుతున్నారన్నారు. గ్రామాలు అన్ని విధాల తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.తద్వారా గ్రామాల్లో డ్రైనేజీ,రోడ్లు, వీధిలైట్లు, మంచినీటి పైపులైన్లు ట్యాంకులు తదితర వాటి కోసం ఉపయోగించుకొని అభివృద్ధి చేసుకోవడానికి కృషి చేస్తుందన్నారు. విడతలవారీగా ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేస్తుందని ప్రతిపక్ష నాయకులు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారి మాటలకు ధీటుగా ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు.కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్స్ ను రెగ్యులరైజ్ చేయాలి

విశాలాంధ్ర-పత్తికొండ: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు రామ్మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్స్ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్స్ ను రెగ్యులరైజ్ చేసేందుకు అంగీకరించి జీవో తీసుకురావడం జరిగిందన్నారు. నూతనంగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్స్‌ను రెగ్యులరైజ్ చేసే విధంగా గతప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను యధావిధిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్స్ మహేష్, రామ్మోహన్ రెడ్డి, ఓబులేసు, భాష, షమీనా, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీ నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర-కర్నూలు సిటీ : అమృత్ పథకం 2.0లో భాగంగా నగరానికి మంజూరైన మురుగునీటిశుద్ధి కేంద్రం (ఎస్టీపి) ఏర్పాటుకు సంబంధించి రెండు ప్రదేశాలను నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు పరిశీలించారు. శుక్రవారం నగరపాలక, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి సుంకేసుల రోడ్డులో తుంగభద్ర నది ఒడ్డునున్న పాత పంప్ హౌస్, హిందూ స్మశాన వాటికలను కమిషనర్ పరిశీలించారు. రూ.135 కోట్లతో చేపట్టాల్సిన ఎస్టీపీ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఎంపికకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ శేషసాయి, పబ్లిక్ హెల్త్ ఈఈ మురళీమోహన్, ఏసీపీ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ షబ్రీష్, ఏఈలు దినేష్, జనార్ధన్‌లు పాల్గొన్నారు.

ఐఈఆర్టీలకు ట్యాబులపై అవగాహన

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష అమరావతి ఆంధ్ర ప్రదేశ్ వారి ఉత్తరలో మేరకు కర్నూలు జిల్లా నందు ట్యాబుల పట్ల వినియోగాన్ని ఎలా చేయాలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని హార్ట్ హెల్త్ ఫౌండేషన్ భవనంలో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సమగ్ర శిక్ష రాష్ట్ర ఐఈ కో-ఆర్డినేటర్ అమ్మి, రాష్ట్ర పరిశీలకులు కల్పనాశైలా, జిల్లా ఐఈ కోఆర్డినేటర్ సురేష్ రాజు, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సునీల్, ఐఈఆర్ టీ లు పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లలు డిజిటల్ విద్యలో ముందుండాలని ఉద్దేశంతో విజన్ 2025 ను ప్రారంభించడం జరిగింది. భవిత కేంద్రాలలో ఉన్నటువంటి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్యాబుల ద్వారా ఏ విధంగా విద్యను బోధించాలి అని ఇవ్వడం జరిగింది రాబోయే కాలలో వీరికి కూడా డిజిటల్ విద్యలో ముందుండాలని శిక్షణా కార్యక్రమం నిర్విస్తున్నట్లు కల్పన శైలా పేర్కొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 21, సెప్టెంబర్ 2024

పాము కాటుతో...
మహిళా కూలీ మృతి

విశాలాంధ్ర-చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన మహిళా కూలీ హుసేనమ్మ (45) పాము కాటుతో మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ముత్యాలపాడుకు చెందిన హుసేనమ్మ చాగలమర్రిలోని కూలూరు రస్తాలో ఓ రైతు పొలంలో మొక్కజొన్నలను కోసేందుకు కూలీగా వచ్చింది.పొలంలో కంకులు కోస్తుండగా పాము కాటుకు గురైంది.ఇది గమనించిన తోటి కూలీలు స్థానిక కేరళ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఘర్షనలకు పాల్పడితే కఠిన చర్యలు-డీఎస్పీ

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : గ్రామాలలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయా గ్రామ నాయకులను ఆళ్లగడ్డ డిఎస్పి రవికుమార్ హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల వ్యాప్తంగా జరిగిన దాడులతో సామాన్యులు భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలంలోని అత్యంత సమస్యాత్మకమైన చింతలాయిపల్లి, అంకిరెడ్డిపల్లి తదితర గ్రామాలలో కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబుతో కలిసి ఆయన పర్యటించారు.రెండు గ్రామాల్లోని ఇరుపార్టీ నాయకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిన ఎవరు వ్యవహరించిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలి తప్ప ఘర్షనులకు పాల్పడవద్దన్నారు. సారా మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు సహకరించి ప్రశాంతంగా జీవించాలన్నారు.

ఎస్సీ,ఎస్టీ అత్యాచార కేసుల విచారణలో నిర్లక్ష్యం వీడాలి- జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణలో నిర్లక్ష్యం ఉండకూడదని, పెండింగ్‌లోని కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పోలీస్‌అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, అత్యాచార కేసుల విచారణ వేగవంతం కావడానికి పోలీస్, రెవెన్యూ అధికారుల మధ్య సమన్వయం ఉండాలన్నారు.పెండింగ్‌లోని కేసులకు సంబంధించి పోలీస్, రెవెన్యూ శాఖలు ప్రత్యేకంగా రిజిస్టర్ లు నిర్వహించి, పరస్పరం కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు కేసుల విచారణ స్థితిపై సమీక్షలు చేసుకోవాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన రిలీఫ్, ఇతర ప్రయోజనాలను అందించే విషయంలో వేగంగా స్పందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..ఇప్పటి వరకు మానిటరీ రిలీఫ్ రూ.1.35కోట్లు అందించామన్నారు.పెండింగ్‌లోని రిలీఫ్ మొత్తాన్ని త్వరితగతిన మంజూరు చేసేందుకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు డీవో లెటర్ పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కేసులను బట్టి బాధితులకు చట్ట ప్రకారం ప్రయోజనాలు లభిస్తాయని, ఆ మేరకు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసులపై కలెక్టర్ ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, దిశా డీఎస్పీలతో సమీక్షించారు. 63 కేసులు పెండింగ్‌లో ఉంటే ఇందులో ఎన్ని ఛార్జ్ షీట్ ఫైల్ అయ్యాయి, ఎందుకు పెండింగ్ ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు.చాలా వరకు ఛార్జ్ షీట్స్ ఫైల్ అయ్యాయని, చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో మిస్సింగ్ రికార్డ్స్ కు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్పీకి సూచించారు. హై కోర్టు స్టేలో ఉన్న కేసులపై డీవో లెటర్ పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాస్ట్ సర్టిఫికెట్ కారణంగా ఏకేసు కూడా పెండింగ్ ఉండకూడదన్నారు. ఆదోని సబ్ కలెక్టర్, ఆర్డీవోలు ఈఅంశంపై దృష్టి సారించాలని, సంబంధిత తహసీల్దార్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సివిల్ రైట్స్‌డే నిర్వహించేలా అధికారులకు సర్క్యులర్ పంపాలని కలెక్టర్ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిని ఆదేశించారు.వసతి గృహాల్లో టాయిలెట్స్ నిర్మాణంపై స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఎండితో మాట్లాడామని, అదే విధంగా బీసీ, ఎస్సీ,వసతి గృహాల మరమ్మతులపై ప్రతిపాదనలు పంపామని, సి ఎస్ ఆర్ కింద కూడా చేయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. క్యాస్ట్ వెరిఫికేషన్‌లో భాగంగా సబ్ కలెక్టర్, ఆర్డీవోలు రాండంగా కొన్ని కేసులు చెక్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. పోలిసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరపాలన్నారు.

పట్టణ అభివృద్ధే లక్ష్యం-ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఎమ్మెల్యే డా.బీవీ జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక 5వ వార్డు సాయి గణేష్ కాలనీ, 33 వ వార్డు, 16వ వార్డు చునంబట్టి దగ్గర, 14వ వార్డు గూడూరు బైపాస్ రోడ్డు, 23వ వార్డు బుడగ జంగాల ఏరియా, 5వ వార్డు శివనగర్ కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే డా.బీవీ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ రూ.1.40 కోట్లలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్ని వార్డులు అభివృద్ధి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డి ఈ మనోహర్ రెడ్డి, ఆయా వార్డు ఇన్చార్జులు, వార్డు కౌన్సిలర్లు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వంపై ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు గ్రామాల్లో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, నాయకులు గోనుమాన్ నంసన్న, కలుగొట్ల లక్ష్మన్నలు కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని గురించి వివరించారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ముందు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అవ్వా తాతలకు 4 వేలు, వికలాంగులకు 6వేలు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చామని, ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం అన్నారు. ప్రత్యేకాధికారి రామ్మూర్తి, టీడీపీ నాయకులు రామాంజనేయులు, కంపాడు లక్ష్మన్న, నరసన్న,కొల్లు లక్ష్మన్న, హనుమన్న,వెల్ఫేర్ అసిస్టెంట్, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర-బనగానపల్లె: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన విషాద సంఘటన పలుకూరులో చోటు చేసుకుంది. గురువారం నందివర్గం పోలీస్ స్టేషన్ ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు పలుకూరు గ్రామానికి చెందిన అంగజాల ఎల్ల సుబ్బయ్య వయసు 54 సంవత్సరములు గురువారం సాయంత్రం గ్రామంలోని తన పొలంలో వ్యవసాయం చేయడానికి ఎద్దులకు ఇనుప గుంటక తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు ఇనుప గుంటకకు పొలంపై నుండి వెళుతున్న విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురవడంతో బనగానపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కొరకు తరలించగా డాక్టర్లు పరీక్షించి అంగజాల ఎల్ల సుబ్బయ్య చనిపోయినట్లు తెలిపారు. కుమారుడు అంగజాల ప్రభాకర్ ఫిర్యాదు మేరకు నందివర్గం ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర-హొళగుంద :ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగుదేశం పార్టీ నాయకుడు రాంపురం సదాశివ అన్నారు. నేరనికిలో శుక్రవారం గడపగడపకు మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. నాయకులు సదాశివ, కార్యకర్తలు,ఎంఈఓ సత్య నారాయణ ఇంటింటా తిరిగి మంచి ప్రభుత్వం 100 రోజుల అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు.స్టిక్కర్లు ప్రతి ఇంటికి అతికించారు సదాశివ మాట్లాడుతూ ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారంగా నడుచుకున్నారని దీపావళి లో మహిళలకు ఉచితంగా గ్యాస్లు ఇవ్వబడుతుందని పెన్షన్లు వెయ్యి రూపాయలు పెంచి ప్రతీ నెల అందించడం జరుగుతుందని అన్నారు అని చంద్రబాబు వల్లే సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తామని అన్నారు కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజశేఖర్, మల్లికార్జున, ఆదిభసప్ప, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు కోకిల తోట, నేరనికి తండాలో గడపగడపకు మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది కార్యక్రమంలో ఏపీఓ భక్తవత్సలం, ఏఈ వర్మ పాల్గొన్నారు గ్రామంలో మొక్కలు నాటారు.

వరద బాధితులకు దుప్పట్లు..చీరలు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : వరద బాధితులకు రాయలసీమ మహిళా సంఘ్ ఆధ్వర్యంలో జక్కంపూడి ,వైఎస్ఆర్ కాలనీలోని గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం నీట మునిగిన వారికి 100 మందికి చీరలు దుప్పట్లు రాయలసీమ మహిళా సంఘం ఆధ్వర్యంలో శకుంతల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శకుంతల మాట్లాడుతూ కర్నూల్ లో కూడా వరదలు వచ్చినప్పుడు మనం కూడా చాలా ఇబ్బంది పడ్డామన్నారు. అన్నమయ్య జిల్లాలో కూడా మూడేళ్ల కిందట వరదలు వచ్చినప్పుడు సంఘ్ తరుపున చేశామన్నారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా సాయం అందించిన దాతలకు ధన్యవాదాలు తెలుపుతూ అక్కడ వారికి చీరలు,దుప్పట్లు ,మాస్కులు కూడా పంపిణీ చేసినట్ల ఆమె తెలిపారు. విజయవాడకు చెందిన లీలావతి, కృష్ణవేణి, చందులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమాన

విశాలాంధ్ర-బనగానపల్లె: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కోర్టు జరిమాను విధించినట్లు టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు. సీఐ కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు 17.9.2024 బనగానపల్లె శివార్లు ఉన్న సాయి బాబా టెంపుల్ వద్ద మద్యం సేవించి వాహనాలు నడుపుచుండగా మీరాపురానికి చెందిన తిమ్మరాజు కుమారుడు చల్లా వడ్డే సాయికుమార్ 19 ఏళ్ళ ..దస్తగిరి కుమారుడు సాహెబ్ గారి హుస్సేన్ వలి 19 ఏళ్లు.. ఇద్దరిని శుక్రవారం బనగానపల్లె కోర్టులోహాజరు పరచగా కోవెలకుంట్ల మెజిస్ట్రేట్ షేక్ అబ్దుల్ రహమాన్ వారు మొదటి వ్యక్తికి రూ.10వేలు, రెండో వ్యక్తికి రూ.5 వేలు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.

విజయం సాధించిన విద్యార్థునులకు అభినందనలు

విశాలాంధ్ర-నందికొట్కూరు: నీట్ ఎంట్రన్స్ 2024లో నందికొట్కూరులో ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థి విద్యార్థినులు ద్రాక్షాయని,దక్షిత, సాయి తేజ, విక్రమ్‌లను శుక్రవారం జనసేన పార్టీ శ్రీరామ థియేటర్ అధినేత జనసేన నాయకులు రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో శాలువాలతో గౌరవంగా సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.మధు,సీనియర్ జనసైనికుడు జనసేన రాము, సంపత్‌కుమార్, రాజు, పుష్ప,కుమార్, బాలరాజు రమేష, పరశురాం విద్యార్థుల తల్లిదండ్రులు తదితర జనసైనికులు పాల్గొన్నారు

విద్యార్థుల లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలి-పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-నందికొట్కూరు : విద్యార్థుల లక్ష్యాలు ఉన్నతంగా ఉండాలని..వాటిని సాధించుకునేందుకు కష్టంతో కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసించాలని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర హై స్కూల్‌లో విద్యార్థి చదువుకో గమ్యాన్ని చేరుకో అనే అవగాహన కార్యక్రమం ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దక్క కుమార్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి మండల విద్యాశాఖ అధికారి సుభాన్ హాజరు కావడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో చేరుకోవాలని అదేవిధంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు సేనో డ్రగ్స్ అంటూ వాటిని దూరంగా ఉంచాలన్నారు. అదేవిధంగా విద్యార్థినిలు పరిచయం లేని వ్యక్తితో ఇన్‌స్టాగ్రామ్ ఫేస్బుక్ ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో చాటింగ్ చేయొద్దని వారు మిమ్మల్ని మాయమాటలతో మోస పూరితంగా ఇబ్బంది గురి చేస్తారని వారన్నారు. అదేవిధంగా అమ్మాయిలు ఒంటరిగా ఎక్కడికి వెళ్ళద్దని ముఖ్యంగా విద్యార్థినులు నిర్మిరియామంగా ఉన్నటువంటి ప్రదేశాలకు వెళ్లొద్దని పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలంటూ విద్యాభివృద్ధి కోసం మాత్రమే విద్యార్థులు ఫోన్లు వాడాలన్నారు. అమ్మాయిలు కేవలం ఇంటికి పరిమితం కాదు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వాటికి మా యొక్క పోలీస్ సపోర్టు మీకు అందిస్తామని విద్యార్థినులకు సూచించారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తెచ్చే విధంగా ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ రామిరెడ్డి , బాలికల జూనియర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ పార్వతి ఫిజిక్స్ లెక్చరర్ కాజా హుస్సేన్ ,ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య నాయకులు అశోక్ , శ్రీకాంత్, రాజా, జీవన్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దేశభక్తి భావంతో మెలగాలి

విశాలాంధ్ర-కోడుమూరు : ప్రతి ఒక్కరూ దేశభక్తి భా వంతో మెలగాలని,ఎవరి పనిని వారు శ్రద్ధతో చేసు కుంటే వారిలో దేశభక్తి ఉన్నట్లేనని కోడుమూరు ఎ స్సై ఏపీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన స్వాగతోత్సవ వేడుకలను విద్యార్థినీ -విద్యార్థులు ఘనంగాజరుపుకున్నారు.కళాశాల కరస్పాండెంట్ గూట్లో శేఖర్ ఆధ్వర్యంలో సీనియర్ విద్యార్థులు ఏర్పాటుచేసిన స్వాగతం వేడుకలకు కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఎస్సై ఏపీ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో ముఖ్యంగా రైతులు,డాక్టర్లు,పోలీసులు,టీచర్లు వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, అలాగే విద్యార్థులు ఎవరి పనిని వారు శ్రద్ధతో చేసుకుంటూ పోతే, వారందరిలో దేశభక్తి ఉన్నవారే అవుతారని తెలిపారు.ఒక వ్యక్తికి లేని మర్యాద,గౌరవం వంటివి హెూదాకు మాత్రమే ఉంటాయనీ,అందుకే ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలతో బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకొని పెద్దలను,తల్లిదండ్రులను గౌరవించాలనిసూచించారు. అనంతరం కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఎస్సై చేతుల మీదుగా బహుమతులను ప్రధానం చేశారు.అలాగే కళాశాలలో స్వాగతోత్సవ సభ వేదికపై విద్యార్థినీ-విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు,పాటలు,డాన్సులు తోటి విద్యార్థులను ఆందోత్సాహాలతో ముంచెత్తాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్,ఎం వీరేష్,పి బాలస్వామి,టి ఆంజనేయులు,సి నాగరాజు, భాస్కరరావు,బి శేఖర్,ఎం ఉన్ని కుమార్,ఎం వెంకటేశ్వర్లు,ఈ సురేష్,విద్యార్థిని-విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాలను తనిఖీ

విశాలాంధ్ర-కోడుమూరు : కోడుమూరు ఒకటవ, మూడవ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాలను జిల్లా మలేరియా అధికారి నూకరాజు తనిఖీ చేశారు.శుక్రవారం ఆయన పట్టణంలోని ఆయా సచివాలయ పరిధిలో స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా,ఫైలేరియా,మెదడువాపు జ్వరములకు దోమలు పుట్టకుండా దోమలు కుట్టకుండా చూసుకోవడం ఒక్కటే ఉత్తమ రక్షణ అని,సమాజ భాగస్వామ్యంతో ఈ వ్యాధులను నివారించవచ్చన్నారు. చలి జ్వరము,తలనొప్పి,కీళ్లు,కండరాల నొప్పి ఉన్న వెంటనే ప్రజలు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి తగు చికిత్స ఉచితంగా తీసుకోవాలని పేర్కొన్నారు. సాధారణంగా పగటిపూట కుట్టే ఏడిస్ దోమ కాటు ద్వారా డెంగ్యూ జ్వరం, రాత్రిపూట కుట్టే అనాఫిలస్ ద్వారా మలేరియా జ్వరం రావొచ్చని,వీటి నివారణకు దోమలు కుట్టకుండా దోమతెరలు వాడవలయునని తెలిపారు.దోమలు పుట్టకుండా ఇంటిలో,ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవలెనని,నీటి తొట్టెలను వారానికి ఒకసారి శుభ్రపరిచి ఎండలో ఆరబెట్టిన తర్వాత నీళ్ళు నిల్వ చేసుకోవాలని కోరారు.ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించవలనని సూచించారు.ఆరోగ్య కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు ఖచ్చితంగా ప్రతి శుక్రవారం ఇంటింటికి తిరిగి ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి దోమల లార్వాలను కనిపించిన వెంటనే తీసి వేయించాలాన్నారు. జ్వరము లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు అయితే వెంటనే రక్తపూతలు సేకరించవలెనని సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఈ ఓ నరసప్ప,హెల్త్ సూపర్వైజర్ కె.కమాల్ సాహెబ్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్,ఆరోగ్య కార్యకర్తలు,ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతిజ్ఞ-పరిసరాలు శుభ్రం చేసి సమాధానం

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: స్థానిక ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపోలో ఉద్యోగులంతా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులంతా కలిసి ఎమ్మెల్యే బి.వి.జయ నాగేశ్వరరెడ్డి స్వచ్ఛత లో భాగంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని నిర్వహించిన చోట శ్రమదానం చేసి ఎర్రమట్టిని చెట్లు నాటిన చోట డిపో మేనేజర్ బి అమర్నాథ్ తో పాటు అసిస్టెంట్ మేనేజర్ జి . వి.నాగరాజు ఎల్ .హెచ్. గంగప్ప మరియు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ బి అమర్నాథ్ సారథ్యం వహించి స్వభావ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛతను అనుసరించి మేము స్వచ్ఛత కొరకు కట్టుబడి ఉంటామని, అందుకొరకు మా సమయాన్ని అంకితబ ద్ధం చేస్తామని, సంవత్సరానికి 100 గంటలు అంటే వారానికి రెండు గంటలు చొప్పున పరిశుభ్రత కొరకు స్వచ్ఛందంగా పాటుపడతామని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తవెయ్యమని, ఇతరులతో వెయ్యనీయమని, పరిశుభ్రత అన్నది దైవంతో సమానమని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుటకు తమ వంతు కృషి చేస్తామని ఉద్యోగులతో ఉదయం 6 గంటలకు ప్రతిజ్ఞ చేయించి శ్రమదానం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజా రవాణా విభాగం ఆయన ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపోలో "స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు" సెప్టెంబర్ 17 వ తారీకు నుండి అక్టోబర్ 1వ తారీకు వరకు నిర్వహించాలని ఈ కార్యక్రమంలో అందరూ ఉద్యోగులు పాల్గొని తమ ఇంటి పక్కన మరియు ముందు ఎటువంటి చెత్త వేయకుండా తమ వంతు కృషిగా చేయాలని ఈ సందర్భంగా డిపో మేనేజర్ కోరారు. స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత పరిసరాల స్వచ్ఛత శుభ్రత మనందరి బాధ్యతగా భావించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మద్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి ఎర్రమట్టిని యూనియన్ తరపున తెప్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు బస్టాండ్ మేనేజర్ ఎల్లప్ప, ఏ డి సి ఎస్. పి. ఎం. సాహెబ్ , గంగప్ప, చాంద్ భాషా, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ ఎం రఫీక్ మరియుఉద్యోగులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : విఠల్ నగర్ లో ఉన్న గుడ్ షెఫర్డ్ పాఠశాల క్రీడా ఆవరణలో జాతీయ షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం సందర్భంగా షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు వారికి బహుమతులు ప్రధానం చేసి క్రీడాకారుల సమక్షంలోనే కేక్ కట్ చేసి ఒకరికొకరు షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 20వ తారీఖున జాతీయ షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం గా ఫెడరేషన్ నిర్ణయించిందని దానికి అనుగుణంగా రాష్ట్రంలోని జిల్లాలు జిల్లాలోని పాఠశాలలో షూటింగ్ బాల్ క్రీడా దినోత్సవం అని ఘనంగా జరుపుకోవాలని ప్రముఖ న్యాయవాది శ్రీధర్ రెడ్డి తెలిపారు. షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి పరుశ రాముడిని ప్రత్యేకంగా అభినందించారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ప్రసంగిస్తూ పరశురాముడు ఈ మధ్యనే షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నూతన కార్యవర్గంలో సభ్యుడిగా ఎంపికైనందుకు జిల్లాకు ఎంతో గర్వకారణం తెలిపారు. క్రీడలను అభివృద్ధిపరిచేందుకు తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక అసోసియేషన్ అధ్యక్షుడు బి రామాంజనేయులు, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి హర్షవర్ధన్, యోగాసన సంఘం కార్యదర్శి ప్రభాకర్, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సుభాన్ భాష, సభ్యులు మధు, రాహుల్ ,రమ్య, సులోచన, రాజేశ్వరి ,సునంద, జిల్లా షూటింగ్ బాల్ కోచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటండి వాటిని సంరక్షించండి

విశాలాంధ్రబ్యూరో-కర్నూలు : స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు.శుక్రవారం "స్వచ్ఛతా హీ సేవా-2024" కార్యక్రమంలో భాగంగా బి.తాండ్రపాడులోని డైట్ కాలేజ్ లో ఎంపీ నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరితో కలిసి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష మొక్కలు నాటారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వాలు ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేది వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా శుక్రవారం డైట్ కాలేజ్‌లో చింత, సీతాఫలం, జామ, కొబ్బరి, పూల మొక్కలు తదితర 250 మొక్కలు నాటడం జరిగిందని, డైట్ కాలేజీలో విద్యార్థులు కూడ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. మొక్కలు నాటి పోషించడం వలన పరిసర ప్రాంతాలలో ఆక్సిజన్ సమృద్ధిగా ఉండి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు.ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరిలు మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడం జరుగుతుందని వారు తెలిపారు.జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామ పీడీ అమర్నాథరెడ్డి, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ శ్యామల, ఆర్డివో శేషిరెడ్డి, డైట్ కాలేజ్ ప్రిన్సిపల్ జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహణ

విశాలాంధ్ర-సి.బెలగల్: మండల కేంద్రమైన సి.బెలగల్‌లోని గురుకుల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూల్ మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రానీ వైద్య సిబ్బందితో కలిసి గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు మధుమేహం మరియు రక్త పోటు ఈసీజీ తదితర వైద్య పరీక్షలను డాక్టర్ మహమ్మద్ ఇమ్రానీ నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ బలరాం, ఉప ప్రిన్సిపాల్ విజయుడు మరియు ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞం తిరుపతిరావు వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-మద్దికెర : మండల కేంద్రంలో శుక్రవారం శ్రీ విద్యా సాయి విద్యాసంస్థల ఫౌండర్ శ్రీయజ్ఞం తిరు పతి రావు యాదవ్ ఏడో వర్ధంతి సందర్భంగా పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రామానికి తన వంతు ఏదో ఒకటి చేయాలని ఒక గొప్ప సంకల్పంతో విద్యాసంస్థలు నెలకొల్పి పేద విద్యార్థులకు విద్యను అతి తక్కువ ఫీజుతో అందిస్తూ అదేవిధంగా అమ్మాయిలు చదువు 10వ తరగతి తో ఆగకుండా పై తరగతులు చదవాలంటే మన మండలానికి ఇంటర్ మరియు డిగ్రీ కళాశాల తీసుకొస్తే ఎందరో అమ్మాయిలు..అబ్బాయిలు, విద్యావంతులు చేయొచ్చన్న సంకల్పంతో కళాశాలను స్థాపించడం జరిగిందని. స్థాపించినప్పటి నుంచి మంచి ఫలితాలతో పాటు విద్యాసంస్థ ఎంతో మందికి విద్యను అందించాలనే ఆయన ఆశయాన్ని నిలబెట్టడానికికి మా వంతు కృషి చేస్తున్నామన్నారు.

మొక్కల పెంపకం మానవ మనుగడకు..

విశాలాంధ్ర-శిరివెళ్ల : మానవ మనుగడకు ఎంతగానో దోహదపడే పచ్చని మొక్కలు నాటి సంరక్షించి వృక్షాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డ్వామా పీడీ ఆర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తో కలిసి కళాశాల ప్రిన్సిపల్ ఇస్రాత్ బేగం అధ్యక్షతన మొక్కలు నాటారు. పిడి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించేం దుకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని మానవుని జీవితకాలం పెరుగుదలకు పచ్చని చెట్లు అండగా నిలుస్తాయన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులు ప్రక్కన నివాస ప్రాంత ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి సంరక్షించి వృక్షాలుగా ఎదిగేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ,నాగేంద్ర,గ్రామ సర్పంచు చంద్ర, ఉప సర్పంచ్ బసాపురం ఇంతియాజ్, టీడీపీ ఇన్చార్జి ఫిదా హుస్సేన్,పాఠశాల ఉపాధ్యాయులు, పద్మప్రియ మరియు సజీద,తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలసిన..

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్: ఆత్మకూరు నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబుని శుక్రవారం మర్యాద పూర్వకంగా ఆత్మకూరు పండ్ల తోటల రైతు సంఘం నాయకులు ఆత్మకూరు దివంగత సర్పంచ్ ఎంఏకే జిలాని కుమారుడు రైతు సంఘం నాయకులు మోమిన్ మునీర్‌భాష, కృషి పండ్ల తోటల అధ్యక్షుడు భైరాపురం మహబూబ్‌బాష, దుబ్బ లింగమూర్తి, ఎస్.ఎస్.అసదుల్లా, ముసల మడుగు నభిస, టైగర్ బాబు, మోమిన్ జబ్బర్ సాబ్, మాబున ముర్తుజా, ముసలమడుగు రషీద్, ముసలముడుగు రసూల్‌లు కలిశారు.

మొక్కలు నాటండి పర్యావరణాన్ని కాపాడండి

విశాలాంధ్ర-అవుకు: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి అని మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు జరుగుతున్న స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు. మొక్కలు మానవ మనుగడకు ఎంతో అవసరమని మొక్కల పరిరక్షణ మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీధర్ రావు, వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్, ఎపిఎం విజయ గోపాల్, గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అశ్విన్ కుమార్, సచివాలయ సిబ్బంది, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.